ప్రతిభచాటిన క్రీడాకారుడికి సన్మానం



శ్రీశాంత్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి: జాతీయ స్థాయి జూనియర్ వూషూ క్రీడా పోటీలలో రంగారెడ్డి మహవీర్ వూషూ అకాడమీకి చెందిన క్రీడాకారుడు కాంస్య పతకాన్ని సాధించాడు. శనివారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ క్రీడాకారుడిని అభినందించి సర్టిఫికెట్ అందజేశారు. తెలంగాణ రాష్ట్రంలో వూషూ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో గచ్చిబౌలి స్టేడియంలో 24వ జూనియర్ జాతీయ స్థాయి వూషూ క్రీడా పోటీలు జరిగాయని అకాడమీ డైరెక్టర్, కోచ్ సంతోష్‌యాదవ్ తెలిపారు. మొత్తం 28 రాష్ట్రాలు, ఏడు కేంద్ర పాలిత ప్రాంతాలు, మూడు యూనిట్స్‌లు కలిపి 1000 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి 42 మంది క్రీడాకారులు పాల్గొనగా రంగారెడ్డి జిల్లా మహవీర్ వూషూ అకాడమీ నుంచి ఇద్దరు క్రీడాకారులు పాల్గొన్నారని వివరించారు. వీరిలో ఒకరు జి.శ్రీశాంత్ జూనియర్ వూషూ క్రీడాకారుడు థౌలు గ్రూప్ విభాగంలో కాంస్య పతకాన్ని సాధించారని వివరించారు.

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు



ఓంనగర్ కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న ఎస్ఈ రామ్మోహన్

బండ్లగూడ: ప్రజలకు విద్యుత్ సమస్యలు రాకుండా ప్రత్యేక దృష్టిసారిస్తున్నామని విద్యుత్ ఎస్ఈ రామ్మోహన్ అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ ఓంనగర్ కాలనీ అధ్యక్షుడు తీగుళ్ల శ్యాములుగౌడ్ ఆయనను కలిసి కాలనీలో విద్యుత్ సమస్యలను వివరించారు. ఈ నేపథ్యంలో శనివారం ఆయన కాలనీలో పర్యటించి విద్యుత్ సమస్యలను తెలుసుకున్నారు. వర్షాలు తగ్గగానే ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే వాటికి శాశ్వత పరిష్కారాలు చూపిస్తామని హామీ ఇచ్చారు. డీఈ రత్నాకర్‌రావు, ఏడీఈ సత్యనారాయణ, ఏఈ మల్లేష్‌రాజ్, లైన్‌మెన్ కృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, కాలనీ నేతలు లక్ష్మణ్, రమేష్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్గిల్ అమరవీరులకు ఘన నివాళి



రాయదుర్గం: కార్గిల్ విజయదివాస్‌ను పురస్కరించుకొని నానక్‌రాంగూడలోని బీజేపీ డివిజన్ కార్యాలయంలో శనివారం అమరవీరులకు నివాళులు అర్పించారు. పార్టీ గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షుడు శివాసింగ్ ఆధ్వర్యంలో అమరవీరులను స్మరిస్తూ కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. 2 నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా అధికార ప్రతినిధి వరలక్ష్మీ, దీరజ్, డివిజన్ ఉపాధ్యక్షుడు కిషన్, ప్రధాన కార్యదర్శి బబ్లూసింగ్, కోశాధికారి ఉమేష్‌గౌడ్, నాయకులు ఉదయలక్ష్మీ, కవిత, సంకేష్‌సింగ్, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భారతదేశం పుణ్యభూమి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డా. సత్యప్రకాశ్ మహరాజ్

రాయదుర్గం: భారతదేశం పుణ్యభూమి అని, భారతమాత క్షేమంగా ఉంటేనే మనమంతా క్షేమంగా ఉంటామని ముంబాయి విశ్వకుటుంబ్ ధర్మ పరిషత్ స్వామి డాక్టర్ సత్యప్రకాశ్ సరస్వతి రుద్ర దాండి మహరాజ్ పేర్కొన్నారు. శనివారం గచ్చిబౌలిలోని శాంతిసరోవర్ బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సనాతన చర్చ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశం సనాతన ధర్మం ఆచరించే ప్రాంతమన్నారు. మీ ప్రతి అడుగులో శాంతి ఉంటే ప్రతి కార్యం సఫలమవుతుందన్నారు. బ్రహ్మకుమారీస్ స్థానిక కేంద్రాల డైరెక్టర్ బికె కుల్‌దీప్ దీదీ మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతోనే శాంతి పరిఢవిల్లుతుందన్నారు. కార్యక్రమంలో కేంద్ర ఎంఎస్ఎంఈ ప్రమోషన్ కౌన్సిల్ చైర్మన్ రాజేష్‌కుమార్, డా. జనార్దన్ రెడ్డి, అంజలి, బి.కె.వంశీతోపాటు పలువురు బ్రహ్మకుమారీస్ సంస్థ, ముంబాయి విశ్వ కుటుంబ్ ధర్మ పరిషత్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బండ్లగూడ న్యూ ఓల్డ్ కాలనీలోని ప్రధాన రహదారిపై నిలిచిన వరదనీరు



లంగర్‌హౌస్ బ్రిడ్జి ప్రాంతంలోని రోడ్డుపై పారుతున్న వరదనీరు



శంషాబాద్ చౌదరిగూడ, ఇంద్రారెడ్డి కాలనీ రోడ్డు



భారీ వర్షాలతో పరేషాన్

- ఎడతెరిపి లేని వర్షాలతో రోడ్లన్నీ గుంతలే
- నడవలేని పరిస్థితుల్లో ప్రజలు
- ప్రమాదాలబారిన వాహనదారులు
- వర్షానికి కొట్టుకుపోయిన బీటీ రోడ్డు

రాజేంద్రనగర్: నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులు పూర్తిగా గోతులమయంగా మారాయి. వరద ప్రవాహానికి బీటీ రోడ్లతో పాటు స్థానిక రోడ్లు కొట్టుకుపోయి ప్రమాదభరితంగా మారాయి. గోతుల్లో వరదనీరు నిలిచి రాకపోకలకు తీవ్ర అంతరాయాన్ని కలిగిస్తున్నాయి. నడిచేందుకు సైతం వీలు లేకుండా ఆయా ప్రాంతాల్లో రోడ్లు వర్షం కారణంగా ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ సర్కిల్‌తో పాటు బండ్లగూడ కార్పొరేషన్, మణికొండ, శంషాబాద్, నార్సింగి మున్సిపాలిటీ, శంషాబాద్ గ్రామ పంచాయతీల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఈ సమస్య నెలకొంది. కొన్ని ప్రాంతాల్లో రోడ్లపై వరదనీరు నిలిచిపోవడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఇళ్ల నుంచి బయటికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ఈ వర్షాలతో నియోజకవర్గ ప్రజలు, వాహనదారులు, వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.



శంషాబాద్ మండలం కేబీ దొడ్డి-రాయన్నగూడ రోడ్డు ఇలా...



బీటీ రోడ్డు కొట్టుకుపోయి గుంతలు పడిన అల్కాపూర్ టౌన్‌షిప్ రోడ్డు



నడిచేందుకు సైతం వీలు లేని బుద్వేల్ గ్రీన్ సిటీ రోడ్డు



హైదర్‌గూడ చౌరస్తాలో...



రాజేంద్రనగర్-బుద్వేల్ ప్రధాన రహదారిపై నిలిచిన నీరు

108 అడుగుల హనుమాన్ విగ్రహం

- ఆంజనేయ స్వామి విగ్రహ నిర్మాణ పనులు ప్రారంభం
- ఆధ్యాత్మిక కేంద్రంగా పోసారం గుట్ట విరాజిల్లాలి
- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, కొండల్‌రెడ్డి

మణికొండ: నార్సింగిలోని పోసారం గుట్ట ఆధ్యాత్మిక కేంద్రంగా నిలవాలని, అందుకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. శనివారం దేవాలయం ఆవరణలో ఏర్పాటు చేయనున్న 108 అడుగుల హనుమాన్ విగ్రహ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఔటర్‌రింగ్ రోడ్డు పక్కన 108 అడుగుల హనుమాన్ విగ్రహం ఎంతో శోభాయమానంగా ఉంటుందన్నారు. దేవాలయం సైతం అన్ని రకాలుగా అభివృద్ధి చెంది, పెద్ద ఎత్తున భక్తులు వస్తారన్నారు. గతంలో పనులను ప్రారంభించినా దేవాదాయ శాఖ అధికారులు పనులకు అడ్డు చెప్పటంతో నిలిచిపోయాయి. ప్రస్తుతం వారితో మాట్లాడి సమస్య పరిష్కరించి పనులను ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు, ముఖ్యమంత్రి తమ్ముడు కొండల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ టి.మల్లేష్‌ముదిరాజ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ కె.వేణుగౌడ్, వైస్ చైర్మన్ కె.దశరథ్‌యాదవ్, మాజీ వైస్ చైర్మన్ ప్రవీణ్‌యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ పాపిరెడ్డి, నాయకులు నర్సింహా, కిరణ్‌కుమార్, అమరేందర్‌రెడ్డి, రాము, హరిశంకర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సరిపడా ఎరువులు: ఏవో శ్వేత



శంషాబాద్ రూరల్: శంషాబాద్ మండల పరిధిలోని రైతులకు సరిపడా యూరియా, డీఏపీ ఎరువులు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయధికారి శ్వేత తెలిపారు. రైతులు ఈ విషయంలో ఎలాంటి అపోహలను నమ్మవద్దని సూచించారు. మల్కారం, చిన్న గోల్కొండ సొసైటీ కార్యాలయాలు, ప్రైవేటు డీలర్ల వద్ద ఎరువులు ఉన్నాయన్నారు. వ్యవసాయ శాఖ పర్యవేక్షణలో రైతులకు సరిపడా ఎరువులు పంపిణీ జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. 75 మెట్రిక్ టన్నుల యూరియా, 55 మెట్రిక్ టన్నుల డీఏపీ, 80 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఏవో వివరించారు.

ఉప రాష్ట్రపతిగా బీసీలకు అవకాశం ఇవ్వాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి మనోజ్ పండ్ల



రాజేంద్రనగర్: భారత ఉప రాష్ట్రపతిగా బీసీలకు అవకాశం కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి మనోజ్ పండ్ల కోరారు. శనివారం స్థానికంగా జరిగిన బీసీల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... భారత రాష్ట్రపతిగా తొలిసారి ఆదివాసీ మహిళ ద్రౌపతి ముర్ముకు అవకాశం కల్పించి దేశ చరిత్రలో గొప్ప మనసున్న నాయకుడిగా ప్రధాని నరేంద్ర మోదీ నిలిచారన్నారు. అలాగే ఉప రాష్ట్రపతిగా బీసీ కులాల వారికి అవకాశం కల్పించి బీసీలకు మోదీ వ్యతిరేకం కాదని నిరూపించుకోవాలని కోరారు.

సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న నర్సింగ్‌రావు

మణికొండ: మొయినాబాద్‌లో ఆగస్టు 2వ తేదీన నిర్వహించనున్న సీపీఐ జిల్లా మహాసభలకు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు, జిల్లా మాజీ కార్యదర్శి పుస్తకాల నర్సింగ్‌రావు పిలుపునిచ్చారు. శనివారం నార్సింగిలో ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేదలు నిర్మించుకుంటున్న ఇందిరమ్మ గృహాలకు సకాలంలో బిల్లులు ఇవ్వాలని, రేషన్ కార్డులు లేని వారికి కొత్తవి రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయాలన్నారు. నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో జ్వరాలు, జలుబులు వచ్చే అవకాశం ఉంటుందని, ప్రభుత్వ ఆసుపత్రులలో అన్ని రకాల మందులను అందుబాటులో పెట్టాలన్నారు. నాలాల ఆక్రమణలను వెంటనే తొలగించాలన్నారు. మండల కార్యదర్శి ఎస్.మల్లేష్, సభ్యులు శంకరయ్య, బాబురావు, స్వామి, శ్రీకాంత్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు అవసరం

రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ

అత్తాపూర్: విద్యార్థులు చదువుతోపాటు ఆసక్తి ఉన్న వివిధ అంశాల్లో రాణిస్తూ నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ సూచించారు. అత్తాపూర్‌లోని పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్‌లో 2025–26 విద్యా సంవత్సరానికి ఇన్వెస్టిచర్ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. కొత్తగా ఎన్నికైన స్టూడెంట్ కౌన్సిల్ సభ్యుల అధికార ప్రవేశ వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కొత్తగా ఎన్నికైన స్టూడెంట్ కౌన్సిల్ సభ్యులకు బ్యాడ్జీలను ప్రదానం చేశారు. దీని త్వరాత ప్రమాణ స్వీకార కార్యక్రమం, పాఠశాల జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ మాట్లాడుతూ... పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి, విద్యార్థులకు సమగ్ర అభ్యాస అనుభవాన్ని అందించడానికి ఎప్పుడూ కట్టుబడి ఉంటుందన్నారు. ఇన్వెస్టిచర్ వేడుకలు పాఠశాల కేలండర్‌లో ఒక ముఖ్యమైన సంఘటన ఇది విద్యార్థులలో బాధ్యత నాయకత్వ, సంస్కృతిని పెంపొందించడంలో పాఠశాల అంకితభావాన్ని సూచిస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కోడూరు అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, అతిథులు

మాదకద్రవ్యాలతో భవిత బుగ్గి

- యువత అప్రమత్తమై దూరంగా ఉండాలి
- రాజేంద్రనగర్ సీనియర్ సివిల్ జడ్జి రాధిక



మాట్లాడుతున్న రాజేంద్రనగర్ సీనియర్ సివిల్ జడ్జి రాధిక

రాజేంద్రనగర్: మాదకద్రవ్యాల వినియోగం సమాజానికి పెను సవాల్‌గా మారిందని.. ముఖ్యంగా యువత ఉజ్వల భవిష్యత్తును నాశనం చేస్తుందని రాజేంద్రనగర్ సీనియర్ సివిల్ జడ్జి కె.రాధిక అన్నారు. రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం మాదకద్రవ్యాలపై న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి మాట్లాడుతూ... మాదక ద్రవ్యాలతో సమాజంపై పడుతున్న దుష్ప్రభావంపై అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల బారిన పడకుండా యువత తమను తాము ఎలా రక్షించుకోవాలో వివరించారు. మాదకద్రవ్యాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాటితో కలిగే నష్టాలు, ప్రభుత్వ చర్య, సమాజ సహకారంపై ప్రస్తావించారు. రాజేంద్రనగర్ ఏసీపీ, ఇన్‌స్పెక్టర్లు మాట్లాడుతూ... మాదకద్రవ్యాల అనర్థాలపై యువతకు అవగాహన కల్పించి వారిలో మార్పు తీసుకురావాలనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సుధారాణి మాట్లాడుతూ... భవిష్యత్తులో తమ కళాశాలలో మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మాదకద్రవ్యాల రహిత సమాజాన్ని నిర్మించడానికి కట్టుబడి ఉన్నామన్నారు. జూనియర్ సివిల్ జడ్జి నీలిమా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రవీణ్ నాయక్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ యాదగిరి, రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, కళాశాల సీనియర్ అధ్యాపకులు శ్యాం సుందర్, అధ్యాపక, విద్యార్థి బృందం పాల్గొన్నారు.



పాల్గొన్న విద్యార్థినీవిద్యార్థులు

మహిళల ఆర్థిక ప్రగతికి ప్రభుత్వం చేయూత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

బండ్లగూడ: మహిళల ఆర్థిక ప్రగతి, అభ్యున్నతికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తూ ఆ దిశగా మంచి ఫలితాలను సాధిస్తోందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. వంద రోజుల ప్రణాళిక ఒక్క మార్పు అభివృద్ధికి మలుపులు అనే కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాల సభ్యులకు వడ్డీ లేని రుణాల చెక్కుల పంపిణీ, మహిళ సంఘాల సభ్యుల స్వయం ఉత్పత్తుల ప్రదర్శన, స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ పాల్గొన్నారు. మహిళ సంఘాలకు రూ. 5.50 కోట్ల వడ్డీ లేని రుణాల చెక్కులను అందజేశారు. వీధి విక్రేయదారుల చిరు వ్యాపారులు అభివృద్ధి చేసుకునే దిశగా ముందడుగు వేయాలన్నారు. ఆర్థిక పరిపుష్టి, వారి కుటుంబ పోషణ మెరుగుపర్చుకోవాలని, వారికి కావాల్సిన ఆర్థిక సాయం ప్రభుత్వం, బ్యాంకుల ద్వారా అందించేలా వీధి విక్రేతలను ప్రోత్సహిస్తామన్నారు. మహిళ సంఘాల సభ్యుల స్వయం ఉత్పత్తులు వివిధ తినుబండారాలు ప్రదర్శనను పరిశీలించి, ఆరోగ్యమైన ఆర్గానిక్ ఫుడ్ తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి పి.శ్రీధర్, కమిషనర్ బి.శరత్‌చంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ రాందాస్, ఏఎంసీ డి.చంద్రశేఖర్‌రెడ్డి, పీడీ మెప్మా రంగారెడ్డి, జి.వెంకట,నారాయణ, మేనేజర్ టి.పర్వతాలు, టీఎంసీ ఎస్.శ్రీలత, మున్సిపల్ అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఏసీబీ దాడులతో టెన్షన్

ఖాళీగా రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయం



రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయం

రాజేంద్రనగర్: జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ డాక్టర్ రవికుమార్ శుక్రవారం అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కడంతో శనివారం సర్కిల్ కార్యాలయం నిర్మానుష్యంగా కనిపించింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎలాంటి సందడి లేకుండా కార్యాలయం మూగబోయింది. టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ఇంజనీరింగ్, పారిశుద్ధ్యం తదితర విభాగాల్లో అధికారులతో పాటు సిబ్బంది కనిపించలేదు. అధికారులు, సిబ్బంది అంతా ఉదయం కార్యాలయానికి వచ్చి అనంతరం క్షేత్రస్థాయి పర్యటన పేరిట బయటికి వెళ్లారు. ఎప్పుడు వివిధ సమస్యలపై కార్యాలయానికి వచ్చే వారు సైతం కనిపించలేదు. వచ్చిన ఉద్యోగులు సైతం ఏసీబీ అధికారుల దాడులపైనే చర్చించుకుంటూ కనిపించారు. ఏసీబీ అధికారులు అర్ధరాత్రి వరకు సర్కిల్ కార్యాలయంలోనే ఉన్నట్లు సమాచారం. రిమాండ్‌కు సంబంధించిన పూర్తి పనులను నిర్వహించిన అనంతరం ఉప కమిషనర్‌ను కార్యాలయం నుంచి తరలించారు. సర్కిల్ కార్యాలయంలో అధికారి పట్టుబడిన అనంతరం నగరంలోని ఆయన నివాసంలో సోదాలు చేసినట్లు తెలిసింది.

బీజేపీ రాజేంద్రనగర్ కార్యవర్గం



నూతన కమిటీని ప్రకటిస్తున్న జిల్లా అధ్యక్షుడు రాజభూపాల్‌గౌడ్

రాజేంద్రనగర్: భారతీయ జనతా పార్టీ (బీజేపీ) రాజేంద్రనగర్ డివిజన్ నూతన కమిటీని శనివారం రంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడు రాజభూపాల్ గౌడ్ ప్రకటించారు. డివిజన్ అధ్యక్షుడిగా సందీప్‌ముదిరాజ్, ఉపాధ్యక్షులుగా మల్లేష్ చారి, తొండుపల్లి మల్లేష్, పి.సురేందర్, సరితారెడ్డి, జనరల్ సెక్రటరీగా యు.పవన్, ఎస్.రాజశేకర్‌రెడ్డి, సెక్రటరీగా డి.కవిత, విష్ణువర్ధన్ రెడ్డి, బి.అంబిక, డి.పర్వతాలు యాదవ్, కోశాధికారిగా శ్రీనివాస్ రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా ఎల్.వెంకటేశ్, నరసింహా, జ్ఞానేశ్వర్, జంగయ్య, సాగర్ రెడ్డి, ముత్యం రెడ్డి, విజయ్ కుమార్, ప్రకాశ్ రెడ్డి, శివ శంకర్ ముదిరాజ్ తదితరులను నియమించారు.

సకాలంలో సాయం అందాలి

భారీ వర్షాలు కురుస్తున్నాయి

- ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- సాయం అందించేందుకు సహాయ బృందాలు
- ఆయా బృందాలు సత్వరమే స్పందించాలి
- నార్సింగి మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి

మణికొండ: భారీ వర్షాలు కురుస్తున్నందున మున్సిపాలిటీ పరిధిలో అత్యవసర పరిస్థితి వస్తే వరద బాధితులకు సకాలంలో సాయం అందించేందుకు బృందాలు సిద్ధంగా ఉండాలని నార్సింగి మున్సిపల్ కమిషనర్ టి. కృష్ణమోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో పలు శాఖల అధికారులతో ఆయన డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వర్షాలు కురిసిన సమయంలో రోడ్లపై నీరు నిలవకుండా వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. పాత గృహాలు ఉంటే అందులోని వారిని ఖాళీ చేయించాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా చూసుకోవాలని, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులను వెంటనే అరికట్టేందుకు మందుల పంపిణీ, ఆరోగ్య జాగ్రత్తలను తెలపాలన్నారు. రోడ్ల పక్కన ఉండే చెత్తను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్‌రెడ్డి, జలమండలి మేనేజర్ రామకృష్ణారెడ్డి, విద్యుత్ ఏఈ మణికంఠ, మండల వైద్యాధికారి సత్యరత్న, డీఈ నరేష్‌కుమార్, ఏఈ శ్రీనివాస్, టీపీఓ మణిహారిక, సిబ్బంది పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు పథకాలు చేర్చాలి...

నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వీధి వ్యాపారులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఆత్మనిర్భర్ నిధి, మైక్రో క్రెడిట్ పథకం, ఎస్వీ రుణాలు, చెల్లింపులు, డిజిటల్ చెల్లింపు శిక్షణ, గుర్తింపు కార్డులు, వ్యక్తిగత బ్యాంకు ఖాతాలు తెరవటం లాంటి విషయాలను తెలియజేయాలని మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో టౌన్‌వెండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వీధి వ్యాపారులకు స్వయం ఉపాధి, విక్రయ సరిహద్దులను గుర్తించటం, బీమా సౌకర్యం, ఆర్థిక అక్షరాస్యత శిబిరం, సామర్థ్య నిర్మాణ శిక్షణలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా సంఘాల నాయకురాళ్లు, అధికారులు పాల్గొన్నారు.